క్లుప్తంగా

రేషన్ బియ్యం పట్టివేత



పట్టుకున్న బియ్యంతో టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్

పెంచికల్‌పేట్: మండలంలోని అగర్‌గూడ గ్రామానికి చెందిన అడేటి సత్యనారాయణ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన మూడున్నర క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్ తెలిపారు. పక్కా సమాచారం మేరకు ఇంటిపై సోమవారం దాడులు నిర్వహించగా, అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం పట్టుకుని కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఎస్సై సందీప్, కానిస్టేబుళ్లు మధు, రమేశ్, సంజీవ్ పాల్గొన్నారు.

బడి బయట పిల్లల సర్వే



సర్వే చేస్తున్న సీఆర్పీ సునీల్

వాంకిడి: మండలంలోని నీమ్‌గావ్, సామేల గ్రామ పాఠశాలల పరిధిల్లో సీఆర్పీలు సునీల్, దుర్గం సందీప్ ఆధ్వర్యంలో సోమవారం బడి బయట పిల్లల సర్వే నిర్వహించారు. నీమ్‌గామ్‌లో ఒకరు, సామేలలో ఇద్దరు బడి బయటి పిల్లలను గుర్తించి వివరాలు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. జనవరి 10వ తేదీ వరకు బడి బయట పిల్లల సర్వే నిర్వహిస్తామన్నారు. బడికి వెళ్లని పిల్లలు ఉంటే సమాచారం అందించాలని అన్నారు. ఉపాధ్యాయురాలు రాజేశ్వరి పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువుతో అధిక దిగుబడి



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆసిఫాబాద్‌రూరల్: సేంద్రియ ఎరువుతో పంట అధిక దిగుబడి వస్తుందని ఏఈవో రాము అన్నారు. మండలంలోని పర్శనంబాల, యాపల్ పాటి గ్రామంలో వాసన్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సేంద్రియ సాగుపై సోమవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయన ఎరువుల సాగుతో భూసారం తగ్గిందన్నారు. సేంద్రియ ఎరువులతో భూసారం పెరిగి పంట దిగుబడి పెరుగుతుందన్నారు. సిబ్బంది తిరుపతి, జయవర్దన్ రైతులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక

బెజ్జూర్: మండల మాలి సంఘం అధ్యక్షుడు ఆదే అశోక్ బీఆర్‌ఎస్‌కు గుడ్‌బై చెప్పి సోమవారం బీజేపీలో చేరారు. వార్డు సభ్యురాలి కుమారుడు తొర్రెం జలపతి, తలండి రాములు, ఇప్పకాల శంకర్, తుమ్మల రవి, సడ్మెక వెంకటి, గంగినేని శ్రీనివాస్, వడాయి రాజకుమార్, వడాయి పోశయ్య, గంగినేని రామయ్య బీజేపీలో చేరారు. సిర్పూర్ ఎమ్మెల్యే హరీశ్‌బాబు వారికి కండువాలు కప్పారు. బీఎస్పీ నుంచి సడ్మెక గుండయ్య బీజేపీలో చేరారు. తర్వాత ఎమ్మెల్యేను సన్మానించారు. మెరిపెల్లి తిరుపతి, గంగినేని శ్రీనివాస్, మేరిపల్లి విలాస్, షడ్మెక బుచ్చయ్య, గంగినేని రమేశ్, వెంకటి, మహేశ్, గణేశ్, వాడాయి సు రేశ్, సాంబయ్య, గాండ్ల చందు, కావుడె శంకర్, తొర్రెం తిరుపతి, సామల తిరుపతి పాల్గొన్నారు.

పద్మశాలి జిల్లా అధ్యక్ష పదవికి రాజీనామా

ఆసిఫాబాద్‌అర్బన్: పద్మశాలి సేవా సంఘం జిల్లా అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్లు చెన్నూరి అశోక్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. తన వ్యక్తిగత కారణాలతో రాజీనామా ప్రకటిస్తున్నట్లు వెల్లడించారు. రాజీనామా పత్రాన్ని వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీరామ శ్రీనివాస్‌కు అందజేసినట్లు పేర్కొన్నారు. రాజీనామా నిర్ణయాన్ని పద్మశాలీ ప్రతినిధులు, సభ్యులు అంగీకరించాలని కోరారు.

కొనసాగుతున్న ఉపాధి సామాజిక తనిఖీ



తనిఖీ చేస్తున్న బృందం సభ్యులు

లింగాపూర్: మండలంలోని గ్రామాల్లో ఉపాధిహామీ సామాజిక తనిఖీ మూడు రోజులుగా కొనసాగుతున్నాయి. 14 గ్రామ పంచాయతీల్లో 2022–23 మార్చి వరకు ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులపై బృందాలు ఇంటింటికి వెళ్లి తనిఖీ చేశాయి.

ఆన్‌లైన్‌లో సమగ్ర సమాచారం

- యూడైస్ ప్లస్..పారదర్శక వెబ్‌సైట్
- సమాచారంతో పాఠశాల నిర్వహణకు దోహదం
- హెచ్‌ఎంలకు ముగిసిన శిక్షణ



కెరమెరిలో హెచ్‌ఎంలకు శిక్షణ ఇస్తున్న ఆర్పీలు

కెరమెరి(ఆసిఫాబాద్): యూడైస్ ప్లస్..విద్యావ్యవస్థ సమాచారాన్ని ఆన్‌లైన్ చేసే ఓ వెబ్‌సైట్. అందులో నమోదయ్యే వివరాలు ప్రామాణికం. పాఠశాల నిర్వహణకు దోహదం చేయనుంది. ఎప్పటికప్పుడు వెబ్‌సైట్‌లో జరిగే మార్పులు, చేర్పులపై పాఠశాల నిర్వహణకు విద్యాశాఖ మార్గనిర్దేశం చేసింది. జిల్లాలోని అన్ని మండలాల్లో హెచ్‌ఎంలకు నాలుగు రోజులుగా ఇస్తున్న శిక్షణ శనివారంతో ముగిసింది. మన ఊరు–మన బడి, పీఎంశ్రీల ఎంపిక చేస్తున్న నేపథ్యంలో ప్రాధాన్యత సంతరించుకుంది.

జిల్లాలో..

జిల్లాలో ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలలు 1263 ఉండగా..48 జూనియర్ కళాశాలలు ఉన్నాయి. వాటిల్లో 1,00,847 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. యూడైస్ ప్లస్ పాఠశాల, కళాశాల స్థాయి సమాచారాన్ని ఆన్‌లైన్ చేస్తుంటారు. ఈ సమాచారం ఆధారంగా విద్యాశాఖ ప్రణాళికలు రూపొందించింది. దీనికి అనుగుణంగా బడ్జెట్ కేటాయించి అమలు చేస్తుంటారు. పాఠ్య, రాత పుస్తకాలు, ఏకరూప దుస్తులు, మధ్యాహ్న భోజనం పంపిణీ తదితర వెబ్‌సైట్ ఆధారంగా కేటాయిస్తుంటారు. దేశవ్యాప్తంగా విద్యాప్రమాణాల సూచిక కేటాయింపునకు వెబ్‌సైట్ సమాచారమే ప్రామాణికం. ఫలితంగా ప్రభుత్వాలు నిధులు కేటాయిస్తున్నాయి.

మూడు భాగాల్లో నిక్షిప్తం..

2021–22 వరకు యూడైగా కొనసాగగా..గత విద్యాసంవత్సరం నుంచి యూడైస్ ప్లస్‌గా నవీకరించారు. ఏడాదికోమారు సమాచారం అప్‌డేట్ చేయగా..యూడైస్ ప్లస్‌లో మూడుగంటలకోసారి సాంకేతికత ఆధారంగా సమాచారం నవీకరించడం జరుగుతోంది. తర్వాత ఖచ్చితత్వంతో వెల్లడవుతుంది. ఈ వెబ్‌సైట్‌ను మూడు భాగాలుగా విభజించారు. పాఠశాల వసతులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల మాడ్యూల్స్‌గా ఉన్నాయి. ఎంఈవో, హెచ్‌ఎంల నేతృత్వంలో నిర్వహణ కొనసాగుతుంది. పాఠశాల క్రీడా స్థలం ఉందా..గదులు ఎన్ని ఉన్నాయి. ఇంకా ఏం అవసరం, ఫర్నిచర్, ల్యాబ్ ఇతరత్రా సౌకర్యాలు ఉన్నాయా?అమలవుతున్న కార్యక్రమాలు, తదితర అంశాలు వెబ్‌సైట్‌లో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తున్నారు.

నూతన అంశాలపై శిక్షణ

నూతనంగా తయారుచేసిన యూడైస్ ప్లస్ వెబ్‌సైట్‌లో చేరిన నూతన అంశాలపై అవగాహన కల్పించేందుకు జిల్లాలో హెచ్‌ఎంలకు శిక్షణ ఇచ్చారు. ఎంఈవోలు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, సీసీవో, ప్రతి మండలం నుంచి స్ట్రాంగ్ టీచర్లకు శిక్షణ ముగిసింది.

ప్రతి విద్యార్థికి 'పెన్'నెంబర్

ఈసారి ఏక్ భారత్, శ్రేష్ట భారత్ కార్యక్రమాల ఉద్దేశం వివరించనున్నారు. బాల వాటికలను వచ్చే విద్యాసంవత్సరం నుంచి అందుబాటులోకి తెచ్చే అవకాశం ఉంది. పూర్వ ప్రాథమిక స్థాయి విద్యార్థులకు మరింత నాణ్యమైన విద్య అమలుచేయనున్నారు. కోర్సుల విశేషాలు, అనుబంధ వివరాలపై అవగాహన కల్పిస్తున్నారు. వెబ్‌సైట్‌లో నమోదైన ప్రతి విద్యార్థికి పెన్(పర్మినెంట్ ఎడ్యూకేషన్ నంబరు) కేటాయిస్తున్నారు. అన్ని పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ప్రవేశం పొందింది మొదలు ఉన్నత విద్యను పూర్తి చేసే వరకు ఈ నెంబర్ విద్యార్థికి ఎంతో కీలకం కానుంది.

పక్కాగా వివరాలు నమోదు చేయాలి



పక్కాగా వివరాలను హెచ్‌ఎంలు నమోదు చేయాలి. ఎలాంటి తప్పులు దొర్లకుండా సమాచారాన్ని పూరించాలి. ఈనెల 15 వరకు యూడైస్+ ప్రక్రియను పూర్తి చేయాలి. అనంతరం హార్డ్ కాపీని ఎంఆర్‌సీకి, జిల్లా కార్యాలయంలో సమర్పించాలి.

– రాథోడ్ సుభాష్, సెక్టోరల్ అధికారి

సమస్యలు తీరేదెలా?

- ఎనిమిది నెలలైనా నిర్వహించని సమావేశం
- గ్రామాల్లో అపరిష్కృతంగా సమస్యలు
- పరిష్కరించాలని ప్రజల వేడుకోలు



ఎంపీడీవో కార్యాలయం

తిర్యాణి: ప్రతీ మూడునెలలకు జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశం ఎనిమిది నెలలైన నిర్వహించడం లేదు. దీంతో గ్రామాల్లో సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయి. మండలంలో 29 పంచాయతీలు ఉండగా, 114 అనుబంధ గ్రామాలన్నాయి. సుమారు 25 వేలకు పైగా జనాభా ఉంది. దాదాపు 90 శాతం వరకు ఆదివాసీ జనాభానే ఉంది. వర్షాకాలం కావడంతో మారుమూల గ్రామాల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. గుండాల గ్రామానికి వెళ్లడానికి రోడ్డు సౌకర్యం లేక 6 కి.మీ కాలినడక వెళ్తే తప్ప వారి కనీస అవసరాలు తీరవు. అమీన్‌గూడలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో బ్రిడ్జి నిర్మాణ పనులు నిలిపోయాయి. ఆసిఫాబాద్ నుంచి రొంపెల్లి వరకు నడిచే బస్సు సర్వీసు వివిధ కారణాలతో అధికారులు నిలిపివేశారు. జిల్లా కేంద్రానికి రాకపోకలు సాగించడానికి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమస్యలు పరిష్కరించేలా మండల సమావేశం నిర్వహించాలని గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు.

సమావేశం నిర్వహించాలి



జిల్లా కేంద్రం నుంచి మండల కేంద్రానికి బస్సు సర్వీసును నిలిపివేశారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. సభా దృష్టికి సమస్యను తీసుకెళ్లదామంటే సమావేశం నిర్వహించడం లేదు. మండల సమావేశం నిర్వహిస్తే గ్రామాల సమస్యలు చర్చకు వస్తాయి. అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలి.– సొర రమేశ్‌గౌడ్, ఎంపీటీసీ గడలపెల్లి

మద్యం దుకాణాన్ని తరలించాలి



ఆబ్కారీ సీఐ మంగమ్మకు వినతిపత్రం ఇస్తున్న మహిళలు

కాగజ్‌నగర్‌టౌన్: మద్యం దుకాణాన్ని వేరే ప్రాంతానికి తరలించాలని కాగజ్‌నగర్ మండలం పంచశీల్‌నగర్ కాలనీ మహిళలు పేర్కొన్నారు. సోమవారం ఆబ్కారీ సీఐ మంగమ్మకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మద్యం తాగడానికి వచ్చిన వారు తమ పట్ల అసభ్యంగా ప్రవరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యను అర్థం చేసుకుని ఆ దుకాణాన్ని ఇక్కడి నుంచి తరలించాలని పేర్కొన్నారు.

'టీబీజీకేఎస్‌ను గుర్తింపు సంఘంగా గెలిపించాలి'



మాట్లాడుతున్న మల్రాజు శ్రీనివాస్‌రావు

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణి కార్మికులకు ఎన్నో హక్కులు కల్పించిన కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్‌ఎస్ అనుబంధ కార్మిక సంఘమైన టీబీజీకేఎస్‌ను మరోసారి సింగరేణి గుర్తింపు సంఘంగా గెలిపించాలని బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు కోరారు. గోలేటి టౌన్‌షిప్‌లోని టీబీజీకేఎస్ యూనియన్ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సింగరేణి కార్మికులకు కోలిండియాలో లేని ఎన్నో హక్కులు కల్పించిన ఘనత తెలంగాణ సాధకుడు కేసీఆర్‌కే దక్కుతుందని అన్నారు. జాతీయ కార్మిక సంఘాలు పోగొట్టిన తండ్రికొడుకుల వారసత్వ ఉద్యోగాలను తిరిగి కార్మికులకు కల్పించిన ఘనత టీబీజీకేఎస్‌తోనే సాధ్యమైందన్నారు. కార్మిక సమస్యలపై ఎప్పటికప్పుడు యాజమాన్యంతో చర్చిస్తూ వారికి అండగా నిలిచిన టీబీజీకేఎస్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో టీబీజీకేఎస్ నాయకులు సమ్మయ్య, రవీందర్, మారిన వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, కార్నాథం వెంకటేశం, దేవేందర్, రాజేశం, శ్రీనివాస్, మల్లేశ్, లక్ష్మయ్య, బీఆర్‌ఎస్ నాయకులు మాజీ జెడ్పీటీసీ అజ్మీర బాబురావు, మాజీ సర్పంచ్ తోట లక్ష్మణ్, నాయకులు విమలేష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ వనజ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు గాలికి..



ప్రధాన రహదారికి ఆనుకుని ఏర్పాటు చేసిన ఇటుక బట్టీ

- రోడ్డును ఆనుకుని ఇటుక బట్టీలు
- ఇష్టారాజ్యంగా యజమానులు

కాగజ్‌నగర్‌రూరల్: నిబంధనలు తుంగలో తొక్కి ఇటుక బట్టీల యజమానులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. మండలంలోని నామానగర్, నాగంపేట గ్రామాల వద్ద రోడ్డును ఆనుకుని ఇటుక బట్టీలు ఏర్పాటు చేశారు. ఈ మార్గం గుండా ఈజ్‌గాం, నామానగర్, సీతానగర్, జంబుగ, గజ్జిగూడ, ఆరెగూడ, మోసం, రాస్పెల్లి, సారసాల గ్రామాలతోపాటు పెంచికల్‌పేట, బెజ్జూర్ మండలవాసులు ఈ మార్గం గుండానే ప్రయాణిస్తుంటారు. అయితే ఇటుక బట్టీల నుంచి వచ్చే పొగ, దుమ్ము,దూళి వస్తుండటంతో వాహనదారులకు ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉండడంతో ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తుండటంతో యజమానులు ఇష్టారీతిలో వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. నామానగర్‌లో పాఠశాలను ఆనుకుని ఇటుక బట్టీలు ఉండటంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. మధ్యాహ్నం భోజన సమయంలో ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. రోడ్డుకు ఆనుకుని పదుల సంఖ్యలో బట్టీలు ఏర్పాటు చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు పట్టించుకుని రోడ్డుకు ఆనుకుని ఉన్న ఇటుక బట్టీల యజమానులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఇబ్బందిగా ఉంది



ప్రధాన రహదారిని ఆనుకుని ఇటుక బట్టీలు ఉండటంతో వాహనాలు నడిపే క్రమంలో కళ్లలో దుమ్ము దూళి పడుతుంది. పొగ కమ్ముకుని ఉండటంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. ఈ ప్రాంతానికి రాగానే ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నాం. అధికారులు రోడ్డుకు ఆనుకుని ఇటుక బట్టీలు ఏర్పాటు చేయకుండా చూడాలి. మెడిపల్లి సంతోశ్, వాహనదారుడు, రాస్పెల్లి

చర్యలు తీసుకుంటాం

ఇటుక బట్టీల యజమానులు నిబంధనలు పాటించాలి. ప్రధాన రహదారిని ఆనుకుని బట్టీలు ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటాం. రోడ్డుకు దూరంగా ఇటుక బట్టీలను ఏర్పాటు చేసుకోవాలి. వాహనదారులకు ఇబ్బందులకు కలుగకుండా చర్యలు తీసుకుంటాం.

– శ్రీపాల్‌రెడ్డి, తహసీల్దార్

ఆర్థికసాయం అందజేత

రెబ్బెన(ఆసిఫాబాద్): మండల కేంద్రానికి చెందిన కోల్‌ట్రాన్స్ పోర్టు డ్రైవర్ మిట్ట రామన్న ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. సింగరేణి కాలరీస్ కోల్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) గోలేటి బ్రాంచి ఆధ్వర్యంలో నాయకులు సోమవారం మృతుడికి ఇంటికి వెళ్లి భార్యకు రూ.13,150 నగదు అందించారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్, యూనియన్ అధ్యక్షుడు అరికిల్ల స్వామి, ఉపాధ్యక్షుడు రవిప్రసాద్ గౌడ్, లచ్చన్న, డ్రైవర్ చందు పాల్గొన్నారు.

ఘనంగా భారతీయ భాషా ఉత్సవం

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాకేంద్రంలోని సరస్వతి శిశుమందిర్‌లో మహాకవి సుబ్రహ్మణ్య భారతి జయంతి పురస్కరించుకుని భారతీయ భాషా ఉత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల్లో భాష పరిజ్ఞానాన్ని పెంపొందించే ఉద్దేశంతో సంస్కృతం, హిందీ, తెలుగు, మరాఠీ, బెంగాలీ, ఇంగ్లిష్ భాషల్లో పాటలు ఉపన్యాసాలు, నృత్యాలు, కథల పోటీలు నిర్వహించారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటి నుంచి క్రీడా పోటీలు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్: సింగరేణి డేను పురస్కరించుకొని మంగళవారం నుంచి పలు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు శ్రీరాంపూర్ డీజీఎం(పర్సనల్) అరవిందరావు ఓ ప్రకటనలో తెలిపారు. నస్పూర్‌కాలనీ సేవా భవన్ వద్ద సాయంత్రం 5గంటలకు, 13న శ్రీరాంపూర్ ప్రగతి మైదానంలో బాంబ్‌బ్లాస్ట్, టగ్‌ఆఫ్‌వార్, 50మీటర్ల పరుగుపందెం పోటీలు నిర్వహించనున్నారు. 14న నస్పూర్ కాలనీలోని సేవా భవన్ వద్ద దీపాలంకరణ పోటీలు, 16న జీఎం కార్యాలయం వద్ద ఉద్యోగులకు టగ్ ఆఫ్ వార్, వాలీ బాల్, త్రోబాల్, సీసీసీలోని ఎస్సీటీఏ క్లబ్‌లో బాల్ ఇన్ బాస్కెట్, పాసింగ్ బాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి

- ఎంపీపీ మల్లికార్జున్



మాట్లాడుతున్న ఎంపీపీ మల్లికార్జున్

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అధికారులు కృషిచేయాలని ఎంపీపీ మల్లికార్జున్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. సమావేశంలో 11 శాఖల అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో ఉండి గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలన్నారు. వ్యవసాయశాఖ అధికారుల నిర్లక్ష్యంతో చాలా మందికి అర్హులైన రైతులకు రైతుబంధు రావడం లేదని, ప్రభుత్వ బడుల్లో ఖాళీలు భర్తీ చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలన్నారు. చాలా గ్రామాల్లో భగీరథ నీరు లీకేజీతో రావడం లేదని సర్పంచులు సభా దృష్టి తీసుకువచ్చారు. ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన మహాలక్ష్మి పథకానికి ప్రజాప్రతినిధులకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని ఎంపీపీ ఆర్టీసీ డీఎంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అడ్డఘాట్, వెంకటపూర్, బలంపూర్, మాలన్ గొంది, గ్రామాలకు బస్సు నడిపించాలని డీఎం దృష్టి తీసుకువచ్చారు. అంబేద్కర్ చౌక్ నుంచి వివేకానంద చౌక్ వరకు రోడ్డు పై ఉన్న టేలాలు తొలగించి ట్రాఫిక్ సమస్య లేకుండా చేయాలని సభా దృష్టికి వచ్చింది. సమావేశంలో ఎంపీడీవో శశికళ, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, ఎంపీవో ప్రసాద్, అధికారులు, సర్పంచ్, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సిర్పూర్ ఎమ్మెల్యేకు సన్మానం



ఎమ్మెల్యే హరీశ్‌బాబును సన్మానిస్తున్న నాయకులు



రెబ్బెన: సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్: అసెంబ్లీలో సిర్పూర్ ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం అనంతరం డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబును పట్టణ పద్మశాలి సేవా సంఘం సభ్యులు సన్మానించారు. పట్టణంలోని సర్‌సిల్క్ కాలనీలోని ఆయన నివాసంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. సంఘం అధ్యక్షుడు కె.రాజమౌళి, కులపెద్దలు సిందం చంద్రయ్య తదితరలు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా మున్సిపల్ కమిషనర్ అంజయ్యతోపాటు అధికారులు, సిబ్బంది ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. డీఈ, సిబ్బంది, ఐకేపి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన: సిర్పూర్ ఎమ్మెల్యేగా గెలుపొందిన పాల్వాయి హరీశ్‌బాబును మండలానికి చెందిన బీజేపీ నాయకులు సోమవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. బీజేపీ పార్లమెంట్ కోకన్వీనర్ కొలిపాక కిరణ్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు గుల్బం చక్రపాణి, సీనియర్ నాయకులు రాజు అగర్వాల్, మండల అధ్యక్షుడు గోలెం తిరుపతి, మండల ప్రధాన కార్యదర్శి ఓదెలు, పట్టణ అధ్యక్షులు పసుపులేటి మల్లేశ్‌లు హరీశ్‌బాబుకు శుభాకాంక్షలు తెలిపారు.

సబ్సిడీ సద్వినియోగం చేసుకోవాలి

చెన్నూర్: పండ్ల తోటలకు ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీని రైతులు సద్వినియోగం చేసుకోవాలని హెచ్‌ఈవో మహేందర్ తెలిపారు. పట్టణంలోని మామిడి, జామ తోటలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యానవన శాఖ ద్వారా పండ్ల తోటలకు 50శాతం మొక్కల పంపిణీతో పాటు నిర్వహణ ఖర్చులను సైతం ప్రభుత్వం అందిస్తుందన్నారు. చామింగ్ తుఫాన్ ప్రభావంతో పండ్ల తోటలకు ఎలాంటి నష్టం జరగలేదన్నారు. కార్యక్రమంలో రైతులు రవీందర్‌రెడ్డి, దూలం లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



దహెగాం: గంగాదేవికి పూజలు చేస్తున్న మహిళలు



హారతి ఇస్తున్న వేదపండితుడు



ఈజ్‌గాం శివాలయంలో..

కార్తీక సందడి

దహెగాం: కార్తీకమాసం చివరి సోమవారం కావడంతో మండలంలోని లగ్గాం సమీపంలో పెద్ద వాగు వద్ద భక్తులతో సందడిగా మారింది. తెల్లవారుజాము వాగులో స్నానాలు చేసి అక్కడే సైకత లింగం తయారు చేసి పూజలు చేశారు. గంగాదేవికి హారతి, వాగులో దీపాలు వదిలారు.

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని ఈజ్‌గాం శివ మల్లన్న ఆలయం భక్తులు పూజలు నిర్వహించారు. రుద్రాభిషేకం, శివపార్వతుల కల్యాణం చేపట్టారు.

'రాజ్యాంగాన్ని అవమానపర్చిన బీజేపీ ఎమ్మెల్యేలు'



మాట్లాడుతున్న నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్: అసెంబ్లీ సమావేశాల ప్రారంభంలో ప్రమాణ స్వీకారం చేయకుండా భారత రాజ్యాంగాన్ని బీజేపీ ఎమ్మెల్యేలు డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబుతోపాటు పలువురు అవమానపర్చారని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి సిడం గణపతి, బహుజన ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్ రజీహైదర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రొటెం స్పీకర్‌గా అక్బరుద్దీన్‌ను నియమిస్తే, ముస్లిం నేత అని ప్రమాణ స్వీకారం చేయమని బీజేపీ ఎమ్మెల్యేలు అనడం సరికాదన్నారు. నాయకులు సోయం చిన్నన్న, తిరుపతి, నక్క మనోహర్, కిశోర్, యశ్వంత్, సిద్దం శ్రీను, పోచం పాల్గొన్నారు.